క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్ పిట్టా ఆదిశేషు తండ్రి పిట్టా ఆంజనేయులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఓలంపల్లి ఆంజనేయులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆదివారం గ్రామానికి చేరుకొని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహులు, సుధాకర్‌రెడ్డి, నారాయణ స్వామి, పిట్టా బాబు, మహేంద్ర, బషీర్, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



సేవాలాల్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మడకశిర: సేవాలాల్ జయంతిని పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ తండాలకు చెందిన గిరిజనులు మడకశిరకు తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. సేవాలాల్ చిత్ర పటాన్ని ఓ ప్రత్యేక వాహనంలో ఉంచి పట్టణంలోని ప్రధాన వీధులగుండా ఊరేగింపు చేశారు. పెద్ద, చిన్నా తేడాలేకుండా నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి గిరిజన నాయకులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. బంజారాల హక్కులను కాపాడతామని హామీ ఇచ్చారు.

నూతన కమిటీ ఎంపిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

సోమందేపల్లి: వైద్యశాఖకు సంబంధించి హంసా అసోసియేషన్ నియోజకవర్గ కమిటీని జిల్లా అధ్యక్షుడు షఫీ సమక్షంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనిల్‌కుమార్ నాయక్, కార్యదర్శిగా కేశవయ్య, ట్రెజరర్‌గా రత్నమ్మ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా గిరినాథ్‌రావు, ఉపాధ్యక్షులుగా తనూజా, సుబ్బలక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా ప్రభాకర్‌రాజు, భాగ్యలక్ష్మి, రవీంద్రలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి



మహిళా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి మాదేశ్

పావగడ: స్థానిక జేఎంఎఫ్‌సీ ఆవరణలో తాలూకా లీగల్ సర్వీస్ కమిటీ, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. జేఎంఎఫ్‌సీ సీనియర్ సివిల్ న్యాయమూర్తి మాదేశ్ మాట్లాడారు. మహిళలను గౌరవించాలని, ఏ రకంగా వారిని బాధ పెట్టకుండా పురుషులు ప్రవర్తించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషానందన్, ఏపిపి సజ్జీరప్ప, న్యాయవాది భారతి తదితరులు పాల్గొన్నారు.

కెంచమాంబదేవికి కొబ్బరి అలంకరణ



అమరాపురం: మండల పరిధిలోని గొడనకుంట గ్రామంలో వెలసిన కెంచమాంబదేవికి మండల పూజలో భాగంగా ఆదివారం కొబ్బరి అలంకారం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సమక్షంలో సాయంత్రం మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తులకు అమరాపురం గ్రామానికి చెందిన కరడి వంశస్తులు అన్నదానం చేశారు.

ఎండలు బాబోయ్ ఎండలు

మార్చిలోనే భానుడి భగభగలతో జనం అల్లాడిపోతున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 గంటల తర్వాత బయటకు అడుగు పెట్టాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితి. రాత్రి పూట ఉక్కపోత పెరిగిపోవడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



పెనుకొండ: మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా మారిన ఎగువగడ్డ వీధి

- పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో మండుతున్న ఎండలు
- రోజువారీ పనులు చేసుకునేందుకు జనం ఇబ్బందులు
- ఉదయం 10 తర్వాత బయటకు రావాలంటేనే బెంబేలు
- వడదెబ్బతో జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

పెనుకొండ రూరల్/గుడిబండ: సాధారణంగా వేసవి కాలం అనగానే ఏప్రిల్, మే నెలల్లో ఎండలు అధికంగా ఉంటాయి. అయితే ఈ ఏడాది మార్చి ఆరంభం నుంచే ఎండలు మండుతున్నాయి. గత వారం రోజులుగా దాదాపుగా 40 డిగ్రీలు వరకూ ఎండలు నమోదు అవుతున్నాయి. భానుడి ప్రతాపానికి ఉదయం పది గంటల తర్వాత ఇళ్ల నుంచి ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. మార్చి నెలలోనే ఎండలు ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలలను తలచుకుంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

వడదెబ్బతో జాగ్రత్త



ఎండల ధాటికి ఉష్ణోగ్రతలు చాలా ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ఎండకు బయట తిరిగే వ్యక్తులు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నిత్యం మంచి నీరు, కొబ్బరి నీళ్లు, నీటి సాంద్రత ఎక్కువ ఉన్న పండ్లు తీసుకోవడం మంచిది. కాటన్ దుస్తులు ధరిస్తే మేలు. నూనె వస్తువులు, మసాలాలు, తగ్గించి సులువుగా జీర్ణం అయ్యే ఆహారం తీసుకోవాలి.

– నాగరాజునాయక్, వైద్యుడు, గుట్టూరు పీహెచ్‌సీ

విద్యార్థులపై పర్యవేక్షణ తప్పనిసరి

ఎండల నేపథ్యంలో విద్యార్థులకు ఇప్పటికే ఒంటి పూడ బడులు మొదలయ్యాయి. దీంతో ఉదయం 7:30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ తరగతులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం స్కూల్ నుంచి మండుటెండలోనే విద్యార్థులు ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇళ్ల సమీపంలోనే పాఠశాలల పిల్లల సంగతి అటుంచితే.. ఎక్కువ మంది వివిధ గ్రామాలకు ఆటోలు, బస్సులను ఆశ్రయించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఎండలో తగిన జాగ్రత్తలు తీసుకోకుండా అధిక శాతం మంది విద్యార్థులు ఇంటి బాట పడుతున్నారు. ఈ నేపథ్యంలో పిల్లల విషయంలో తల్లిదండ్రులకు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. బడి నుంచి వచ్చిన పిల్లలను మధ్యాహ్నం బయటకు వెళ్లకుండా చూడడం మేలు. అలా అని వారు టీవీలు, సెల్‌ఫోన్‌లకు అంటిపెట్టుకుని ఉండడమూ తగదు. ఈ దశలో తల్లిదండ్రులు ప్రణాళిక ప్రకారం వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు నీడ పట్టున ఉండి స్నేహితులతో ఆడుకునేలా జాగ్రత్త పడాలి. క్యారమ్, చెస్ వంటి ఆటలు ఆడించాలి. డ్రాయింగ్‌తో పాటు మంచి పుస్తకాలను అందించి చదివిస్తే అన్ని విధాలా మేలంటున్నారు.



గుడిబండ: ఆటోల కోసం ఎండలోనే వేచివున్న విద్యార్థులు

బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం

ఎండకు వెళితే చిన్నారులు, విద్యార్థులు, వయసు పైబడిన వారు వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంది. రోగ నిరోధక శక్తి తక్కువ ఉండటంతో ప్రధానంగా సోకుతుంది. 40 డిగ్రీలు పైబడి ఎండలు ఉన్నప్పుడు ఇంటి నుంచి బయటకు వెళ్లక పోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఉదయం పది గంటలలోపు, సాయంత్రం 5 గంటల తర్వాత పనులు చేసుకుంటే మేలని అంటున్నారు.



గుడిబండ : జనంలేక వెలవెల బోతున్న బ్యాంక్ సర్కిల్



పెనుకొండ: ఎప్పుడూ సందడిగా ఉండే అనంతపురం రోడ్డు ఇలా..



ఎండ వేడిమికి తాళలేక చెట్ల కింద సేదతీరుతున్న దృశ్యం

వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా..

- శరీరం పొడి బారకుండా నిత్యం నీటిని తాగుతూ ఉండాలి.
- కాటన్ దుస్తులు, వదులుగా ఉండే వాటిని మాత్రమే ధరించాలి.
- ఇంట్లో నుంచి బయటకు వెళ్లినప్పుడు హెల్మెట్, క్యాప్ ధరిస్తే మంచిది.
- సూర్య కిరణాలు నిటారుగా పడకుండా కళ్లకు సన్ గ్లాస్ పెట్టుకోవాలి.
- రోజూ 4 నుంచి 6 లీటర్ల మంచి నీటిని తీసుకోవాలి.
- కొబ్బరి నీళ్లు, చల్లని మజ్జిగ, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలి.
- ఆహారంలో ఆకుకూరలు, కాయగూరలు ఉండేలా చుసుకోవాలి.
- నీరు ఎక్కువగా ఉండే పుచ్చకాయ, కర్బూజ, దోస వంటివి తీసుకోవాలి.

వ్యాపారాలు జరగడం లేదు



మార్చిలోనే అధిక ఎండల కారణంగా వ్యాపారాలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రద్దీ అసలు ఉండటం లేదు. ప్రజలు సరుకుల కోసం దుకాణానికి రావడం లేదు. ఉగాది, రంజాన్ పండుగల పూట కూడా ఇలా ఉండటంతో మాకు ఇబ్బందులు తప్పడం లేదు.

– లక్ష్మీనారాయణరెడ్డి, కిరాణా వ్యాపారి, పెనుకొండ

చాలా ఇబ్బంది పడుతున్నాం



నేను ఉపాధి పనులకు వెళ్తుంటాను. ఎండలు అధికం కావడంతో పనులు చేసేందుకు చాలా ఇబ్బంది పడుతున్నాం. మార్చిలోనే అత్యధికంగా ఎండలు నమోదవుతుండటం ఆందోళనంగా ఉంది. ఏప్రిల్, మే నెలలను తలచుకుంటేనే భయమేస్తోంది.

– రత్నమ్మ, ఉపాధి కూలి, మావటూరు

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టండి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



శుభ కార్యంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: మండల పరిధిలోని బైరేపల్లిలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆదివారం పర్యటించారు. ముందుగా మూడ్లప్ప ఇంట్లో జరిగిన శుభ కార్యంలో పాల్గొన్నారు. ఆ తర్వాత పార్టీ శ్రేణులతో సమీక్షించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. ఇచ్చిన హామీల మేరకు ప్రజలకు సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీజీ శివకుమార్, మందలపల్లి సర్పంచ్ అశ్వత్థ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ ప్యాలెస్ కల్యాణ మంటపం ఆవరణలో ఆదివారం టీడీ పల్లికి చెందిన ఈశ్వరప్ప కుమార్తె హరితకు, మడకశిర పట్టణానికి చెందిన బీజీ హళ్లి విలేజ్ సర్వేయర్ పవన్‌కుమార్‌తో వివాహం జరిగింది. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, రాష్ట్ర కుంచిటి వక్కలిగ అనుబంధ సంఘం అధ్యక్షుడు రంగేగౌడు, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, మాజీ కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిబండ జీబీ శివకుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

'పురం'లో శ్రీకృష్ణ దేవాలయం

- 27న భూమి పూజ చేస్తున్నామన్న ఇస్కాన్ జిల్లా అధ్యక్షుడు



మాట్లాడుతున్న భక్త బృందదాస్

హిందూపురం టౌన్: జిల్లాలోనే అత్యంత ప్రాధాన్యమున్న హిందూపురం పట్టణంలో శ్రీకృష్ణ దేవాలయ నిర్మాణం జరగనుంది. ఇస్కాన్ బెంగళూరు హరే కృష్ణా మూమెంట్ హిందూపురం ఆధ్వర్యంలో ఈనెల 27న మొట్టమొదటి శ్రీకృష్ణ దేవాలయం నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ టెంపుల్ జిల్లా అధ్యక్షుడు భక్త బృందదాస్ తెలియజేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకృష్ణుడి దేవాలయం, కృష్ణ సంకీర్తన, ప్రసాద వితరణ ఎక్కడ జరుగుతుందో అప్రాంతమంతా వైకుంఠమై వెల్లివిరిస్తుందన్నారు. శ్రీకృష్ణుడి ఆలయ నిర్మాణం జ్ఞాన సమోపార్జన, ఆధ్యాత్మిక జ్ఞానం, మనిషిలోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానం వైపు నడిపించే మార్గమవుతుందని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు గోవిందా చార్ల దాస్, వెంకటేష్, నాగేంద్ర, చారుకీర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు

మడకశిర: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ రాజ్‌కుమార్ సూచించారు. ఆయన శనివారం రాత్రి పట్టణంలోని కొత్త ఎస్సీ కాలనీలోని ప్రజలకు అవగాహన కల్పించారు. పిల్లలు తప్పులు చేయకుండా తల్లిదండ్రులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో రొళ్ల ఎస్ఐ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి



భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

హిందూపురం టౌన్: భారతమాత ముద్దుబిడ్డలైన భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని సందర్భంగా ఆదివారం ఎస్ఎఫ్ఐ నాయకుల ఆధ్వర్యంలో అమరవీరులకు ఘన నివాళులర్పించారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. విద్యార్థి సంఘం నాయకుడు బాబావలి మాట్లాడుతూ ప్రాణాలను ఫణంగా పెట్టి దేశ స్వాతంత్ర్యం కోసం వీరోచితంగా పోరాడిన యోధులు భగత్‌సింగ్, సుఖ్ దేవ్, రాజ్‌గురు అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, అజయ్, మహేష్, నాగేంద్ర, మంజునాథ్, దిలీప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: భగత్‌సింగ్ సేవలు వెలకట్టలేనివని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి, వైద్యులు రోహిల్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఘనగిరి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్ షాహిద్ దివస్ నిర్వహించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. ప్రజాసంఘాల నాయకులు బాబావలి, యూటీఎఫ్ రమేష్, నబి, ఇమ్రాన్, బాబు, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చలివేంద్రం ఏర్పాటు

పెనుకొండ: పట్టణంలోని ఊరువాకిలి ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎండలు పెరిగిపోవడంతో పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలనే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిలమత్తూరు: మండల పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో చిలమత్తూరుకు చెందిన ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి చిలమత్తూరు వైపు నుంచి కొడికొండకు వెళ్లే క్రమంలో చెక్‌పోస్టులో రహదారి దాటుతుండగా బాగేపల్లి వైపు నుంచి వచ్చిన ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. హుటాహుటిన వారిని చికిత్స నిమిత్తం 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు.

పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ



చిలమత్తూరు: ఆంధ్రప్రదేశ్ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా చిలమత్తూరు వైద్యాధికారి రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా కమిటీ ఎన్నిక జరిగిందని రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యుల సమస్యలపై పోరాటం సాగిస్తామన్నారు. ప్రధాన కార్యదర్శిగా డా.దిలీప్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా స్వరూపారెడ్డి, సరిత, సురేష్ కుమార్, కోశాధికారిగా పుష్పలత, జాయింట్ సెక్రటరీలుగా రాజ్‌కుమార్, నరేష్ కుమార్, రాజేంద్ర, కార్యదర్శులుగా నికేష్, జయవర్ధన్‌రెడ్డి, మెంబర్లుగా కవిత, షేక్ రూబీ, మహేశ్వర మారుతీ, ప్రతిభ, ధర్మరాజ్, నారాయణరెడ్డి, భార్గవ్, రవినాయక్, దండు అల్తాఫ్ ఎన్నికయ్యారు.

నేటి నుంచి రీసర్వే ప్రారంభం

రొళ్ల: మండలంలోని దొడ్డేరి రెవెన్యూ గ్రామాల పరిధిలోని వివిధ గ్రామాల్లో సోమవారం నుంచి రెండో విడత సమగ్ర భూ రీసర్వే పనులు ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. తొలుత దొడ్డేరి సచివాలయం వద్ద గ్రామసభను నిర్వహిస్తామన్నారు. అనంతరం రీసర్వే చేయడంతో రైతులకు కలిగే ఉపయోగాలను వివరిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల గుండా ర్యాలీ చేస్తామన్నారు. రైతులు అందుబాటులో ఉండి తమ భూములకు సంబంధించిన హద్దులను అధికారులతో చూపించుకోవాలని సూచించారు.

నేడు అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ అంగన్‌వాడీ వర్కర్లకు 'పోషణ్ బీ– పడాయి బీ' కార్యక్రమంలో భాగంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ తెలిపారు. అన్ని సెంటర్ల అంగన్‌వాడీ వర్కర్లు శిక్షణ తరగతులకు హాజరు కావాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

పావగడ: తాలూకాలోని తాళేమరదహళ్లిలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. బెంగళూరుకు చెందిన భగవాన్ మహావీర్ జైన్ ఆస్పత్రి, సప్తగిరి ఆస్పత్రి, వాసన్ ఐ కేర్, కావేరి చారాటబల్ రక్త కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో రోగులకు వైద్య సేవలందించారు. నిర్వాహకులు ఎన్ ఆంజనేయులు, టీఎన్ నరేశ్, చిక్కణ్ణ, పి గోపాల్, హనుమప్ప ఉచిత కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు.

ఎలక్ట్రికల్ మెటీరియల్ వితరణ

లేపాక్షి: మండలంలోని బిసలమానేపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి వడారి రామకృష్ణ కుటుంబ సభ్యులు రూ. 35 వేలు విలువ చేసే ఎలక్ట్రికల్ మెటీరియల్‌ను ఆదివారం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటాచారి, అశ్వత్తనారాయణ, గిరింద్ర, నారాయణస్వామి, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

క్షయ రోగులకు కిట్ల పంపిణీ

పావగడ: స్థానిక స్వామి వివేకానంద సంఘటిత ఆరోగ్య కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిక్షయ్ మిత్ర యోజన కింద క్షయ రోగులకు ఆహార ధాన్యాల కిట్లను స్వామి జపానంద పంపిణీ చేశారు. అలాగే సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయి ష్యూర్ ప్రొటీన్ పౌడర్‌ను అందించారు. స్వామి జపానంద మాట్లాడుతూ ఇది వరకూ 15,116 మంది క్షయ రోగులకు ఉచిత వైద్య సేవలందించామన్నారు. అలాగే ఆహార ధాన్యాలు అందించామన్నారు.

ర్యాలీ విజయవంతం చేయండి

పెనుకొండ: బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న జరిగే జైభీమ్ ర్యాలీని అంబేడ్కర్, పూలే, ప్రజాస్వామవాదులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బహుజన చైతన్య వేదిన వ్యవస్థాపక అధ్యక్షుడు శివరామకృష్ణ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నాయకులు విడుదల చేశారు. శివరామకృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ 135వ జయంతిని జరుపుకోవడం ఎంతో అదృష్టమన్నారు. నాయకులు త్రిపురా రిసార్ట్ అధినేత గోపీనాథ్, రవి, బాబు, మూర్తి, మారుతీ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కనిశెట్టిపల్లిలో నీటి కష్టాలు

చిలమత్తూరు: మండల పరిధిలోని కోడూరు పంచాయతీ కనిశెట్టిపల్లిలో నీటి సమస్యతో గ్రామస్తులు అల్లాడిపోతున్నారు. ఒక వీధిలో నీళ్లొస్తే మరొక వీధిలో నీటి సమస్య నెలకొంటోందని స్థానికులు వాపోతున్నారు. అరకొరగా నీళ్లు వదులుతుండగా మహిళలు బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నారు. 15 రోజుల కిందటే కనిశెట్టిపల్లిలో నీటి సమస్య పరిష్కారం కోసం సుమారు రూ.90 వేలు బిల్లులు కూడా మంజూరు చేశారు. అయితే సమస్యను మాత్రం పరిష్కరించలేదని స్థానికులు వాపోతున్నారు. నీటి సమస్యలతో ప్రజల గొంతెండుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శిస్తున్నారు. మంజూరైన బిల్లులు దేనికి వినియోగించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆటోనగర్‌లో కార్డెన్ సెర్చ్



సూచనలిస్తున్న సీఐలు అబ్దుల్ కరీం, జనార్ధన్


హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలోని ఆటోనగర్‌లో ఆదివారం డీఎస్పీ కేవీ మహేష్ పర్యవేక్షణలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సీఐలు అబ్దుల్ కరీం, జనార్ధన్, స్పెషల్ పార్టీ పోలీసులు అనుమానితుల ఇళ్లను తనిఖీ చేశారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లను జల్లెడ పట్టారు. అక్రమ మద్యం అమ్మే వారి నివాసాల్లో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కర్ణాటక విస్కీ 45 బాటిళ్లు, ఓల్డ్ అడ్మిరల్ 19 బాటిళ్లను సీజ్ చేశారు. వాటితో పాటు లైసెన్స్ లేని మూడు ఆటోలు, 12 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, శక్తి యాప్, రోడ్ సేఫ్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు. గొడవలు, అల్లర్లు జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లాలో ఆదివారం 38 మందికి సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి పంపిణీ చేశారు. మొత్తం 38 మందికి రూ.18 లక్షలను చెక్కుల రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులకు సీఎం సహాయ నిధి కింద ఆర్థిక సాయం అందిస్తామన్నారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220717, 9912220723, 9912220726